

బంగారు పాదుకలకు పూజలు చేస్తున్న గవర్నర్

బంగారు పాదుకలకు గవర్నర్ ప్రత్యేక పూజలు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరానికి భక్తుడు కానుకగా ఇస్తున్న బంగారు పాదుకలకు గవర్నర్ డా. తమిళిసై సౌందర రాజన్ ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి అయోధ్య రామమందిరానికి కానుకగా ఇచ్చేందుకు బంగారు పాదుకలు తయారు చేయించారు. ఆ పాదుకలకు గవర్నర్ తమిళిసై రాజ్‌భవన్‌లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య రామమందిరం గర్భగుడిలో ఉంచే బంగారు పాదుకల్ని ప్రతినిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారని గవర్నర్ అన్నారు. శ్రీరాముడికి అంకితభావంతో శ్రీనివాసశాస్త్రి చేసిన సేవలను కొనియాడారు. శ్రీరాముడి పాదుకలకు నిర్వహించిన పూజా కార్యక్రమంలో రాజ్‌భవన్ అధికారులతోపాటు రాజ్‌భవన్ పరివార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌గచ్చిబౌలి 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, ఓల్డ్‌గచ్చిబౌలి, రాడిసన్‌హోటల్, క్యూట్ ల్యాండ్ విల్లాస్, గచ్చిబౌలి ఫ్లైఓవర్ ప్రాంతం, హిమగిరి ఆస్పత్రి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డాగ్‌పార్కు, రాడిసన్ హోటల్, లీమెరిడియన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

● శాంతినగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శాంతినగర్, కడిమి ఆస్పత్రి, హుడాకేఫ్, వెంకటాద్రినగర్, జీహెచ్‌ఎంసీ మీసేవ, వింధ్య నర్సింగ్‌హోం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చందానగర్ హుడాకాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ

షాపూర్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరాముడి అక్షింతలను రామ భక్తులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు అందజేశారు. మంగళవారం వాటిని ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరాముడి అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాని అన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

జీడిమెట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు ఈవో జె. కృష్ణమాచార్యులు, హుండీల పర్యవేక్షణాధికారి వీవీ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు. నాలుగు నెలల ఆదాయం రూ. 2,90,410 వచ్చిందని ఈవో తెలిపారు. దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వేణుగోపాల్, అర్చకుడు విజయ్‌కుమార్ ఆచార్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో ముగిసిన వనభోజన వేడుకలు

ఫతేనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచన మేరకు కూకట్‌పల్లి డిపోలో రెండు రోజులపాటు నిర్వహించిన వనభోజన వేడుకలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు ఉన్నతాధికారులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జోనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ ఖుస్రుషాఖాన్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ కవిత, కూకట్‌పల్లి డిపో మేనేజర్ ఇసాక్‌బిన్ అహ్మద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, అసిస్టెంట్ ఇంజనీర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ

బాలానగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఏఎల్ అయ్యప్ప ఆలయంలో మంగళవారం నిర్వహించిన అయ్యప్ప పడి పూజ, ఇరుముడి కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. మాలధారులు అయ్యప్ప దర్శనానికి బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

● బండి రమేష్‌కు సీఐఈ టెనెంట్స్ అసోసియేషన్ సభ్యుల వినతి

బాలానగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఫేజ్-1కు చెందిన ఎంఎస్ఎం టెనెంట్స్ అసోసియేషన్ సభ్యులు కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీఐఈలో లీజుభూములు విషయంపై చేపట్టిన కార్యాచరణ వివరాలను ఆయనకు వివరించి వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. ముఖ్యమంత్రి, ఆ శాఖ మంత్రిని కలిసి సమస్యను వివరించి పరిష్కారానికి కృషి చేస్తానని రమేష్ వారికి హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావుగౌడ్, కార్యదర్శి సురేంద్రబాబు, మహేష్ అగర్వాల్, మధుసూదన్, దిలీప్, రమేశ్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనప్రియనగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

● కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్



కాలనీవాసులతో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జనప్రియనగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మంగళవారం జనప్రియనగర్‌లో స్థానికులతో ఆయన సమావేశమయ్యారు. సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. నాయకులు నాగేశ్వరరావు యాదగిరిగౌడ్, నరేందర్‌గౌడ్, సంగారెడ్డి, మన్నేపల్లి సాంబశివరావు, సత్యానారాయణ, ఉమామహేశ్వరరావు, అశోక్, కొండల్‌రావు, అంజయ్య పాల్గొన్నారు.

గాయపడిన కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

హైదర్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జయనగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాయుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ ఆయనను మంగళవారం పరామర్శించారు. కంచర్ల విజయభాస్కర్, నాగేశ్వరరావు, రాజేష్, రామచంద్ర, తిమ్మయ్య, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు ఆయన వెంట ఉన్నారు.



రోడ్డు పై నిలిచిన మురుగు నీరు

రోడ్డుపై మురుగు నీరు

● మూడు రోజులుగా పొంగుతున్న మ్యాన్‌హోల్

షాపూర్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మ్యాన్‌హోల్ ఓవర్ ఫ్లోతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. గాజులరామారం డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీ, 4వ రోడ్డులో మూడు రోజులుగా మ్యాన్‌హోల్ పొంగుతుండడంతో రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

దేవేందర్‌నగర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్

గాజులరామారం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దేవేందర్‌నగర్ చౌరస్తాలో ఉదయం, సాయంత్రం నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దేవేందర్‌నగర్ చౌరస్తా మీదుగా వాహనాల రాకపోకలు అధిక సంఖ్యలో ఉంటాయని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.



చౌరస్తాలో నిలిచిన వాహనాలు

గౌతమినగర్‌లో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



గౌతమినగర్ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గౌతమినగర్ కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం కాలనీలో పర్యటించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. గౌతమినగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ, మంచినీరు, రోడ్లు, వీధి దీపాలు, ఎలక్ట్రికల్ సంబంధిత సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ సిటీప్లానర్ సుస్మిత, టీపీఎస్ సోమేశ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

'శేరిలింగంపల్లి అభివృద్ధే లక్ష్యం'

చందానగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హుడాకాలనీలో బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, మనోహర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూడోసారి తనను గెలిపించిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. నాయకులు మోహన్‌గౌడ్, వాల హరీష్‌రావు, రఘునాథ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో భారతీయ భాషోత్సవం



మాట్లాడుతున్న కేంద్రసాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్, సిలికానాంధ్ర తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సి.మృణాలిని

రాయదుర్గం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విభిన్న భాషలు ఉన్నప్పటికీ వాటి మధ్య ఐక్యత కొనసాగడం భారతీయ భాషలో ఉన్న విశిష్ట లక్షణం అని, దానికి మహాభారతాన్ని సజీవ ఉదాహరణగా పేర్కొనవచ్చని కేంద్రసాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్, సిలికానాంధ్ర తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సి.మృణాలిని పేర్కొన్నారు. సెంట్రల్‌యూనివర్సిటీ మానవీయ శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో భారతీయ భాషోత్సవ కార్యక్రమాన్ని ఆచార్య వి.వి. కృష్ణ అధ్యక్షతన హ్యూమానిటీస్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మృణాలిని మాట్లాడుతూ.. మహాభారతాన్ని మూలంలో భావం కోల్పోకుండా తెలుగులోకి అనుసృజన చేసిన గొప్పతనం కవిత్రయ భారతానికి చెందుతుందన్నారు. తెలుగు ప్రజలకు భక్తికంటే లౌకిక విషయాల పట్ల ఆసక్తి ఎక్కువని, ఆ దిశగానే సాహిత్యం కూడా వెలువడిందన్నారు. సుబ్రహ్మణ్య భారతి పేరుతో భారతీయ భాషా దినోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ 24 భాషలలో జాతీయ స్థాయిలో పురస్కారాలను అందిస్తుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఆచార్య వి.కృష్ణ, తెలుగుశాఖ అధ్యక్షుడు దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య భీమయ్య, పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు



శత చండీయాగంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కాసాని, ఆయన కుటుంబ సభ్యులు

నిజాంపేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బాచుపల్లి సప్త మాతృక రాధమ్మ దేవి ఆలయంలో కాసాని జ్ఞానేశ్వర్, ఆయన కుటుంబ సభ్యులు, ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించిన శత చండీయాగంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మేయర్ కొలన్ నీలారెడ్డి, కార్పొరేటర్లు గాజుల సుజాత, ఆగం ముదిరాజు, కొలన్ వీరేందర్‌రెడ్డి, 16వ డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు సబితా జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌ను మరింత అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జీడిమెట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం చింతల్ డివిజన్ ఎన్‌ఎల్‌బీనగర్, పద్మశాలీనగర్, వివేకానంద్ నగర్, శ్రీనివాస్‌నగర్‌లో కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశ్, ప్రభాకర్‌గుప్తా, కొయ్యాడ సురేష్, రాజబ్రహ్మం, నర్సయ్య బాలరాజ్, ఉమాశంకర్, జగన్, స్వర్ణలతారెడ్డి పాల్గొన్నారు.

కూకట్‌పల్లి అభివృద్ధికి రూ. 10 కోట్లు

● త్వరలో ప్రభుత్వం కేటాయింపు : బండి రమేష్



సీఎం రేవంత్‌రెడ్డితో బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం త్వరలో రూ. 10 కోట్లు కేటాయిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం త్వరలో నియోజకవర్గాల వారీగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తుందన్నారు. నిత్యం ప్రజలతో ఉంటూ పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ ఇన్‌చార్జిలు కృషి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని వివరించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలని సీఎం సూచించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయడంతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో కూకట్‌పల్లి అభివృద్ధికి కృషి చేస్తానని బండి రమేష్ తెలిపారు.

ఏటా రెండు లక్షల కొత్త క్యాన్సర్ కేసులు

● డాక్టర్ పి.రఘురామ్



మాట్లాడుతున్న డాక్టర్ రఘురామ్; చిత్రంలో అక్కినేని అమల తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది దాదాపు రెండు లక్షల క్యాన్సర్ కొత్త కేసులు దేశంలో నిర్ధారణ అవుతున్నాయని ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ పి.రఘురామ్ ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల పాటు హెచ్ఐసీసీలో జరిగిన ఆల్ ఇండియా కాంగ్రెస్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ కాన్ఫరెన్స్ సందర్భంగా రొమ్ము క్యాన్సర్ అడ్వొకసి స్క్రీనింగ్‌పై పబ్లిక్ అవేర్‌నెస్ ప్యానెల్ చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అవగాహన, ఆధారిత స్క్రీనింగ్ లేకపోవడం వల్ల కేసులు పెరుగుతున్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభదశలో గుర్తిస్తే కోలుకునే అవకాశం ఉందన్నారు. మహిళలు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ పోషకురాలు అమల అక్కినేని మాట్లాడుతూ.. అనేక ప్రత్యేకమైన, వినూత్న కార్యక్రమాల ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం అవసరమన్నారు. మహిళలకు తప్పనిసరిగా స్క్రీనింగ్ మామోగ్రామ్ చేయించుకోవాలని తెలియదన్నారు.

బస్తీ దవాఖానాలో చోరీ

దుండిగల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానాలో దొంగలు పడ్డారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గల సాయిపూజా కాలనీలో ఉన్న బస్తీ దవాఖానాకు సిబ్బంది మంగళవారం విధులకు హాజరవగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సర్జికల్ ఐటమ్స్, బీపీ ఆపరేటింగ్ మిషన్‌తోపాటు మందులు, ప్లాస్టిక్ కుర్చీలు చోరీ అయినట్లు డాక్టర్ శివాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లిఫ్టు గుంతలో మహిళ మృతదేహం

పేట్‌బషీరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొంపల్లి శ్రీనివాసనగర్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న నాలుగు అంతస్థుల భవనం లిఫ్టు గుంతలో సుమారు 35-45 సంవత్సరాల వయస్సుగల మహిళ మృతి చెందింది. మృతదేహాన్ని చూసిన భవన యజమాని శ్రీధర్ పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయలు ఇంట్లో పెట్టి అదృశ్యం



రమణరావు

బాలానగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లి వ్యక్తి అదృశ్యమయ్యాడు. బాల్‌రెడ్డినగర్‌లో నివసిస్తున్న కంచెరపు రమణరావు(46) ప్లంబర్. సోమవారం మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు తీసుకొచ్చి ఇంట్లో పెట్టి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య అనసూయ మంగళవారం రాత్రి బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాడీబిల్డింగ్‌లో సత్తా చాటిన వినయ్

గచ్చిబౌలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లికి చెందిన వినయ్ షేక్‌పేటలో నిర్వహించిన బాడీబిల్డింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అతడిని మంగళవారం సన్మానించి అభినందించారు. జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, గోపాల్‌యాదవ్, సుభాష్, రాథోడ్, బాడీ బిల్డింగ్ కోచ్ పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

బాలానగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కులస్థులు కలిసికట్టుగా సమస్యలు పరిష్కరించుకోవాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బాలానగర్‌లో ఓ హోటల్‌లో రెడ్డి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, కోశాధికారి వీసీహెచ్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్: హెచ్‌ఎంటీ శాతవాహననగర్ కాలనీ 2024 క్యాలెండర్‌ను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. సంక్షేమ సంఘం గౌరవ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు సీతారాయుడు, జనరల్ సెక్రటరీ యాదిరెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓల్డుబోయినపల్లి: సెంట్రింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మంగళవారం ఆవిష్కరించారు. గుర్తింపు కార్డులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సెంట్రింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి గుర్తింపు కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిని శాలువాతో సత్కరించారు. సెంట్రింగ్ అసోసియేషన్ చైర్మన్ పరుశరామ్‌రెడ్డి, అధ్యక్షుడు కృష్ణ, జనరల్ సెక్రటరీ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆశీర్వదిస్తున్న అర్చకులు

పవిత్రోత్సవాల్లో మంత్రి తుమ్మల

హైదర్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్ కాలనీ డివిజన్ తులసివనం గృహ సముదాయంలో పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆయనను సత్కరించి ఆశీర్వదించారు. భవ్య సంస్థల చైర్మన్ ఆనంద్ ప్రసాద్, డైరెక్టర్ ఆదిత్య, కాంగ్రెస్ ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు శిరీష, తులసివనం అపార్ట్‌మెంట్స్ సంక్షేమ సంఘం నాయకులు ఈశ్వర్ రెడ్డి, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణ



లూయిస్ బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న జస్టిస్ నాగమారుతీశర్మ, కళా జనార్దనమూర్తి

చిక్కడపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అంధులకు లిపిని రూపొందించిన లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణ ఇస్తుందని సీబీఐ న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీ శర్మ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం లూయిస్ బ్రెయిలీ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. జస్టిస్ నాగమారుతీ శర్మ మాట్లాడుతూ.. అంధులు చదువుకు దూరం అవుతున్నారన్న వేదనతో బ్రెయిలీ వారి కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి ఆశాజ్యోతిగా వారి జీవితాలను వెలుగుమయం చేశారని అన్నారు. పరుల కోసం పాటుపడే నిత్య స్మరణీయులు అని అన్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

(5వ పేజీ తరువాయి)

ఫెస్టివల్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారు తమ ఇంట్లోనే తయారుచేసిన 400 రకాల స్వీట్లతో పాటు తెలంగాణ వంటకాలను ఈ సందర్భంగా ఏర్పాటు చేసే ఫుడ్ కోర్టులో విక్రయిస్తారని చెప్పారు. వీక్షకులను ఆకట్టుకునేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పూర్వ వైభవం తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో శైలజారామయ్యర్‌తోపాటు పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, క్లిక్ సంస్థ ప్రతినిధులు బెంజిమిన్, అభిజిత్, ఇంటర్నేషనల్ కైట్ ఫ్లైయర్ పవన్ సోలంకీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

ప్రొఫెసర్ ఎస్. శాంతకుమారి

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలపై హింసను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రసూతి గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్. శాంతకుమారి అన్నారు. మాదాపూర్ హైటెక్స్‌లో ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజీ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌వోజీఎస్ఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా కాంగ్రెస్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ (ఏఐసీవోజీ)లో భాగంగా మహిళలపై హింసను అరికట్టండి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న మహిళకు మార్గనిర్దేశం చేసేందుకు, సహాయం చేయడానికి ఎఫ్‌వోజీఎస్ఐ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామని, మహిళలపై హింసపై చైతన్యం కలిగించడానికి పిల్లలకు రెండు గంటల ఆన్‌లైన్ కోర్సు ప్రారంభించామన్నారు. భారత దేశంలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని తప్పనిసరి చేయడమే మా లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా పిల్లలకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు మూడు లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉన్నారన్నారు. పీటీమ్స్, నేషనల్ కమిషన్ ఆఫ్ ఉమెన్‌తో కూడా భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. మహిళలపై హింస మానవ హక్కుల ఉల్లంఘన అన్నారు. ప్రియాంక దత్, దీప్తి రావుల, డాక్టర్ ధరణికోట సుయోధన్, డాక్టర్ జయదీప్ ట్యాంక్, డాక్టర్ మాధురీ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేస్తున్న ప్రొఫెసర్ శాంతకుమారి

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..

పోలీసుల సూచనలు పాటించండి



మాట్లాడుతున్న ఏసీపీ శివభాస్కర్

కూకట్‌పల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కూకట్‌పల్లి ఏసీపీ శివభాస్కర్ అన్నారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్లలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంతూళ్లకు వెళ్లే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటి ప్రధాన తలుపులకు సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని, తలుపులకు తాళాలు వేసినట్లు కనిపిస్తే దొంగలకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందన్నారు. విలువైన వస్తువులు, నగదు బ్యాంకు లాకర్లలో దాచుకోవడం ఉత్తమమన్నారు. అపార్ట్‌మెంట్లలో నివసించే వారు పక్కింటి వాళ్లకు ఇంటి బాధ్యత అప్పగించి వెళ్లడం మంచిదన్నారు. కాలనీలు, అపార్ట్‌మెంట్స్‌లో సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలన్నారు. చోరీల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాలనీల్లో మైకుల ద్వారా ప్రచారం చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఏసీపీ చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్లు వెంకన్న, కృష్ణమోహన్, డీఐలు, డీఎస్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.